నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వరావు తెలిపారు. చిన్నరెడ్డి ఫీడర్ పరిధిలోని పటేల్ నగర్, అహ్మమద్ నగర్, పోచమ్మ టెంపుల్, సమోసా కర్కానా తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు... బాపునగర్ ఫీడర్ పరిధిలోని ఓవైసీ నగర్ ,న్లక్ష్ హోటల్ ఆకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... సీపీఎల్ ఫీడర్ పరిధిలోని అంబర్‌పేట్, పటేల్‌నగర్, పటేల్ వాడా, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు... ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలోని పటేల్‌నగర్ చౌరస్తా, హనుమాన్ టెంపుల్ సునార్ బౌలి జంక్షన్, ఉదయం స్కూల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఫిజియోథెరపీ సెంటర్ల ఏర్పాటుకు సహకరించాలి

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధి లోని 150 డివిజన్లలో ఉచిత మెడికల్ ఫిజియోథెరపీ సెంటర్ల ఏర్పాటుకు స్థానిక కార్పొరేటర్లు సహకరించాలని హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు తెలిపారు. గ్రేటర్ పరిధిలోని మురికివాడ ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఉచితంగా ఆధునిక వైద్య, ఫిజియోథెరపీ సేవలను అందించడానికి ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు కూడా సెంటర్ల ఏర్పాటుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉత్పత్తులను భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అమిటి ఇండియా సంస్థ ద్వారా వినూత్న ఉత్పత్తులను భవిష్యత్ తరాలకు పరిచయం చేస్తామని సంస్థ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అమిటి ఇండియా సంస్థ తమ నూతన ఉత్పత్తులను ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆవిష్కరించారు. బాంబూ ఫాబ్రిక్‌తో చేసిన వివిధ రకాల మ్యాట్రెస్‌లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టారు.

భారతీయ సంస్కృతి భావితరాలకు అందించాలి



చిక్కడపల్లి: భారతీయ సంస్కృతి, సంప్రదాయ నృత్యాలను భావితరాలకు అందించాల్సిన అవసరముందని విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్ అన్నారు. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధమాన కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, గాయనీగాయకులు గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా నృత్య గురువులు, కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగేష్ ముదిరాజ్, పండిట్ అంజుబాబు, విక్కీ మాస్టర్, వసంతరాయలు, సాయిబాబా, బాలరాజ్‌గౌడ్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



ముషీరాబాద్: బీజేపీ బలోపేతంలో ప్రతి నాయకుడు, కార్యకర్త భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. అడిక్‌మెట్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సాయికృష్ణ యాదవ్ అధ్యక్షతన ఆదివారం ఆయనను కలిసి శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులుపాల్గొన్నారు.

హాస్టల్స్‌లో సీట్ల సంఖ్య పెంచాలి

కాచిగూడ: గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి నగరానికి వచ్చిన విద్యార్థులకు కాలేజీ హాస్టల్స్‌లో సీట్లు దొరకక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రైల్వే స్టేషన్లలో ఉంటూ సీటు కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ శాఖ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌డ్డి వెంటనే జోక్యం చేసుకొని ప్రస్తుతం ఉన్న హాస్టల్స్‌లో 20 శాతం సీట్లు పెంచాలని ఆయన ఆదివారం లేఖ రాశారు. నూతనంగా బీసీల కోసం 100 హాస్టల్స్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ మంజూరు చేసి బీసీ విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లో హాస్టల్స్‌లో సీట్లు లభించక విద్యార్థులు కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లలో ఉంటూ నానా అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. బీసీ కమిషన్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా విద్యార్థుల జీవితాలు రోడ్డు పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లక పోవడం వల్లే ఇదంతా జరుగుతోందని అయన విమర్శించారు. హాస్టల్స్ పెంచడంతో పాటు ప్రస్తుతం ఉన్న హాస్టళ్లలో 20 శాతం సీట్ల సంఖ్యను పెంచాలని కోరారు.

బోనమెత్తి.. మొక్కు చెల్లించి.!

- వైభవంగా ఆషాఢమాసం బోనాల జాతర
- అమ్మవారి ఆలయాలకు బారులు తీరిన భక్తులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లో ఆషాఢమాసం బోనాల పండుగ అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచే కవాడిగూడ తాళ్లబస్తీలోని నల్లపోచమ్మ దేవాలయం, మహంకాళి దేవాలయాల్లో భక్తులు ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకుని బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. తొట్టెల ఊరేగింపు, పోతురాజులు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కవాడిగూడ మున్సిపల్ గ్యారేజ్‌లో స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బండారి యాదగిరి ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ జి.రచన శ్రీ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. బోనాల పండుగను నగర ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాసరెడ్డి, వివిధ పార్టీల నాయకులు ముఠా జైసింహ, కల్వ గోపి, పూసరాజు, బీఆర్‌టీయూ యూనియన్ అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న ముఠా జైసింహ

కల్యాణం.. కమనీయం

చిక్కడపల్లి: గాంధీనగర్‌లోని శ్రీవరాల పోచమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పూసరాజు తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఠా జైసింహ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయం కమిటీ అధ్యక్షుడు ఏ.కనకరాజుయాదవ్, ప్రధాన కార్యదర్శి బండారు శ్రీరాములు, డైరెక్టర్ సిహెచ్ నిరంజన్, ఉపాధ్యక్షుడు పుత్తూరు సాయిరాం పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



కవాడిగూడలో జరిగిన బోనాల వేడుకల్లో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డి, బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు



కవాడిగూడ మున్సిపల్ గ్యారేజ్‌లో జరిగిన బోనాల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్, యూనియన్ అధ్యక్షుడు యాదగిరి

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంఘర్ జాతి విద్యానగర్ కమిటీ ప్రతినిధులు

నల్లకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి, విద్యాప్రమాణాలు మరింతగా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ శాఖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట నర్సింహబస్తీ కమ్యూనిటీహాల్‌లో 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి హాజరైన సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పింజరి నర్సింగ్‌రావు, కోశాధికారి కె. లక్ష్మణ్‌ప్రసాద్ తదితరులతో కలిసి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 40మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసి మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేటర్ విద్యా సంస్థలకు దీటుగా విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సలహాదారు ఆర్.కిషన్, చైర్మన్ ప్రభురాజ్, వైస్‌చైర్మన్ ఎ.సురేష్, కార్యదర్శులు మహేందర్, అజయ్, గోవింద్, శివ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడి హేయమైన చర్య

కాచిగూడ: మున్నూరుకాపు నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన అనుచరులతో దాడి చేయించడం పట్ల తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మణికొండ రమేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ... గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, కవిత ఎన్నోసార్లు తెలంగాణ యాస భాషలో పలువురిని రకరకాల మాటలతో తిట్టారన్నారు. అదే యాసలో తీన్మార్ మల్లన్న అన్న మాటకు దాడి చేయించడం సమంజసం కాదని విమర్శించారు. మల్లన్న పొరపాటున మాట్లాడి ఉంటే అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాని అతడి కార్యాలయంపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేయడం క్రిమినల్ చర్యలో భాగమని వారు పేర్కొన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది కూడా బీసీలను భయపెట్టేయడం, రాజకీయంగా అణగదొక్కడంలో భాగమేనని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహాసభ నేతలు ఎనుగుల మాణిక్ ప్రభు, కొరివి వేణుగోపాల్, జి.సత్యనారాయణ, బిల్లకంటి రవికాంత్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

ముషీరాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేస్తున్నామని అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పాశం సాయికృష్ణ యాదవ్ అన్నారు. అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ నాయకుడు విశ్వనాథ్ శర్మ విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫండ్స్ నుంచి రబ్బర్ స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. నాగమయ్యకుంట, బయాలజికల్ ఈ లిమిటెడ్ రోడ్డులో వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడంతో వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనిని నివారించేందుకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



స్పందించారు.. పరిష్కరించారు.!



సాక్షిలో వచ్చిన కథనం



బీఎస్ఎన్ఎల్ రోడ్డులో చెత్తాచెదారాన్ని ఎత్తివేసి మరమ్మతులు చేసిన జీహెచ్ఎంసీ సిబ్బంది

చిక్కడపల్లి: కంపు కొడుతున్నా కనికరించరా? అనే శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. వెంటనే చిక్కడపల్లి పాత పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న జవహర్‌నగర్ బీఎస్ఎన్ఎల్ రోడ్డులో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఈ, సలామ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేష్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు 'సాక్షి'కృతజ్ఞతలు తెలిపారు.

ముషీరాబాద్ మహంకాళికి మొదటి బోనం

ముషీరాబాద్: వందేళ్ల చరిత్ర గల ముషీరాబాద్‌లోని మహంకాళి అమ్మవారి దేవాలయానికి ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి కుటుంబం ఆదివారం మొదటి బోనం సమర్పించింది. ఈ సందర్భంగా శివాలయం వద్ద గల చంద్రమౌళి ఇంటి నుంచి పోతరాజుల ఊరేగింపు, డప్పుల దరువుల మధ్య బోనంను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దారిపోడవున భక్తులు మొదటి బోనానికి ఘన స్వాగతం పలుకుతూ హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా వై.చంద్రమౌళి మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా అమ్మవారికి మొదటి బోనం సమర్పిస్తున్నామని తెలిపారు. వారం రోజుల పాటు ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ఆదివారం సామూహిక బోనాలు, సోమవారం పోతరాజులు, పలహారం బండ్ల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, దేవాదాయ శాఖ ఈవో మహేందర్‌కుమార్, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొదటి బోనం సమర్పించేందుకు వెళ్తున్న ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి

ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలు



దాయార కమాన్ వద్ద గల దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: ఉర్స్ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ దాయార కమాన్ వద్ద గల హజ్రత్ బందగి మియాన్ షా-ఏ-ఖాసీం ముజాహిద్ 404 ఉర్సు ఉత్సావలను పురస్కరించుకోని దయార కమాన్ వద్ద జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉర్సు ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ప్రజలలో ఐక్యతను, మతసామరస్యాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ హమ్మద్ భక్తియార్, పార్టీ సీనియర్ నాయకులు జావిద్‌ఖాన్, ముస్వర్‌చాంద్, ఇమ్రాన్, షాహెద్, జాఫర్ పాల్గొన్నారు.

మంకాలమ్మ బోనాల పాట ఆవిష్కరణ



ఒగ్గు రాముతో కలిసి బోనాల పాటను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా అంబర్‌పేట ప్రాంతానికి చెందిన ఒగ్గు రాము రాసిన అంబర్‌పేట మంకాలమ్మ బోనాల పాటను ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. యువత కలల పట్ల ఆసక్తిని పెంచుకుని ఇలాంటి ఆధ్యాత్మిక భావనతో కూడిన పాటని రాసుకుని పాడిన ఒగ్గు రాముని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి అభినందించారు. సనాతన ధర్మంలో ఉన్న ఒగ్గు కథలను ఇప్పటికీ పరిరక్షిస్తూ ఇలాంటి భక్తి పాటలను రాయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతం రామ్, లంకల దీపక్‌రెడ్డి, ఎడెల్లి అజయ్‌కుమార్, సి.నందకిషోర్ యాదవ్, పి.నాగరాజు చారి, ఏడెల్లి బాలు, ఎ.యశ్వంత్, సునీల్, కోడూరు శ్రీశైలం, రవి, రమేష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలు, ఇన్‌ఫ్ల్యూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేవారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు గోల్కొండ చౌరాస్తాలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడంతో యువత బెట్టింగ్ యాప్స్‌లో డబ్బులు పోగొట్టుకుంటున్నారని అన్నారు. అప్పులు చేసి మానసికంగా కుంగిపోయి అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బెట్టింగ్ యాప్స్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్న వారిలో ఎంతటి వారున్నా వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడం హర్షణీయం

కవాడిగూడ: బీసీలకు 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి మంత్రివర్గంలో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం వారు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బాగయ్య, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్రతో కలిసి విలేకరుల సమావేశంలో శ్రీహరి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యా, ఉద్యోగ, రాజకీయ, స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లలో గంగపుత్రులకు స్థానిక సంస్థల ఎన్నికలలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రిజర్వేషన్ల అమలుపై భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు.



ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న గంగపుత్ర సంఘం, బీసీ-ఏ కులాల నేతలు

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను ఖండించాలి

ముషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై తీన్మార్ మల్లన్న చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని బీసీ రాష్ట్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్ట బబ్లూగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. అదే విధంగా తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడులు చేయడం కూడా ఎవరూ సమర్థించరని అన్నారు. పరస్పరం వ్యక్తిగత విమర్శలకు పోకుండా బీసీల డిమాండ్‌ల సాధనకై పోరాడాలని సూచించారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

'సినీరంగం ఒక గొప్ప నటుడిని కోల్పోయింది'

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రముఖులు

నల్లకుంట: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపల్, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాసశర్మ అన్నారు. సినీరంగం ఒక గొప్ప నటుడిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. సినిమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనవంతు పాత్ర పోషించారని అన్నారు. ఆ మహా నటుడితో తనకున్న పరిచయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షించారు.

కోట మృతి బ్రాహ్మణ సమాజానికి తీరని లోటు

నటుడు కోట శ్రీనివాసరావు మృతి బ్రాహ్మణ సమాజానికి, సినీ రంగానికి తీరని లోటని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరించారని అన్నారు.

సినీ పరిశ్రమకు కోట సేవలు ఎనలేనివి..

చిక్కడపల్లి: సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల సాంస్కృతిక కళారంగ సేవకుడు కె.ధర్మరావు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన మరణం బాధాకరమని అన్నారు. ఆయన సినీ పరిశ్రమకు ఎనలేని సేవలందించారని తెలిపారు. తన నటనతో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నారని తెలిపారు. సామాజిక సేవలో ముందుండే వారని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కోట శ్రీనివాసరావుతో శ్రీనివాసశర్మ(ఫైల్)

భద్రతకు భరోసా సీసీ కెమెరా..

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అంబర్‌పేట: పౌరుల భద్రతకు సీసీటీవీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శారదానగర్‌లో కాలనీ ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌లతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేరాల నియంత్రణ, వాటిని ఛేదించేందుకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి కాలనీ, బస్తీవాసులు కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. నేరం జరిగాక ఇబ్బందులు పడవద్దని ఆయన కోరారు. ఇటీవల సమీప కాలనీలో భార్యాభర్తల హత్య జరిగిందని, అక్కడ సీసీ కెమెరాలు సరిగ్గా లేకపోవడంతో నేటికీ ఆధారాలు దొరకడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు వెంకట్‌రెడ్డి, చందు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం

గోల్నాక న్యూ తిరుమలనగర్‌లో ఆదివారం బంగారు మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌగ్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక న్యూ తిరుమలనగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్